క్లుప్తంగా

కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయం



మక్తల్: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమని జిల్లా యువజన కాంగ్రెస్ బీసీ సంఘం నాయకుడు రాజేందర్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు వర్తింపజేసిన 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఎన్నికల ఆలస్యంతో గ్రామాల్లో అభివృద్ధి మరింతగా కుంటు పడుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు బీసీ సంఘాలు కృషి చేయాలని కోరారు.

నేటి నుంచి అఖండ జ్యోతి ఉత్సవాలు

కోస్గి : తొగుట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నేటి నుంచి చౌడేశ్వరీ దేవి అఖండ జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అమ్మవారికి పంచామృతాబిషేకం, జల్దిబిందె కార్యక్రమం, మంగళవారం చౌడేశ్వరీ దేవి అఖండ జ్యోతిని పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధన్వాడ: ధ్యానం వల్ల మానసిక ప్రశాంతతో పాటు మానసికంగా ఆరోగ్యంగా ఉండొచ్చని డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఆదివారం ధన్వాడ మండల కేంద్రంలోని యన్‌యన్‌నాయుడు సన్స్ ఫాంహౌస్ దగ్గర పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం వలన చెటు అలవాట్ల నుంచి బయటపడొచ్చన్నారు. అలాగే ఏకాగ్రత పెరగడంతో పాటు, జ్ఞాపకశక్తి మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో ధన్వాడ, కొత్తకోట, వనపర్తి, నారాయణపేట పిరమిడ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన బైక్.. వ్యక్తికి గాయాలు



కృష్ణా: మండలంలోని టైరోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం కర్ణాటకలోని గంజిపల్లికి చెందిన జనార్దన్ హిందుపూర్‌లో కల్లు తాగి తన ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో జనార్దన్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. రోజూ కర్ణాటకకు చెందిన వ్యక్తులు కల్లు తాగడానికి ప్రత్యేక వాహనాల్లో మండలానికి వస్తుంటారని స్థానికులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కోస్గి రూరల్: పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ బాల్‌రాజ్ కథనం మేరకు మున్సిపల్ పరిధిలోని మాసాయపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది సాయప్ప వ్యక్తిగత పనుల నిమిత్తం కోస్గికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కాశప్ప అనే యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తూ సాయప్పను బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో సాయప్పకు తీవ్రగాయాలు కాగా స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముళ్లపొదలు తొలగించాలి



నర్వ: మండలంలోని యాంకి–పెద్దకడ్మూర్ గ్రామాల మధ్య రహదారిని ముళ్లపొదలు కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూరాల డ్యాం, గద్వాల్‌కు వెళ్లేందుకు ఈ మార్గం గుండానే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే గోతుల రహదారి.. మరో పక్క ముళ్లపొదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి పొదలను తొలగించాలని కోరుతున్నారు.

గుట్టుగా మాయం చేస్తున్నారు



అర్ధరాత్రి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు (ఫైల్)

- అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు
- రాత్రి అయితే చాలు టిప్పర్లతో తరలింపు
- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న ఇటాచీ

ధన్వాడ: మండలంలోని మనిపూర్‌తండా, మంత్రోనిపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలానికి సంబంధించిన ఎర్రమట్టి గుట్టలను అక్రమార్కులు గుట్టుగా మాయం చేసేస్తున్నారు. అనుమతులు లేకుండా జేసీబీల సాయంతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. మనిపూర్‌తండా, మంత్రోనిపల్లి, మందిపల్లి, ధన్వాడ గ్రామాలలోని గుట్టలను టిప్పరు వ్యాపారులు ఇష్టం వచ్చినట్లు తవ్వకుంటూ జేబులు నింపుకుంటున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో దుండగులు మరింత రెచ్చిపోతున్నారు. అంతే కాకుండా గుట్టలను చదును చేసుకొని స్థలం అంతా తమదే అంటూ కంచెలను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

వెంచర్ల ఏర్పాటు తదితర నిర్మాణ పనులకు ఎర్ర మట్టిని ఉపయోగిస్తుండడంతో అక్రమార్కులు గుట్టలను తవ్వకుంటూ రోజుకు రూ.వేలల్లో సంపాదిస్తున్నారు. పొలాల పక్కనే ఉన్న గుట్టలను తవ్వేసి చదును చేస్తే ఆ స్థలం కూడా తమ భూమిలో కలుపుకోవచ్చని రైతులు కూడా టిప్పర్ యజమానులకు సహకారం అందిస్తున్నారు. తమ పొలాలను ఆనుకొని ఉన్న గుట్టలపై తవ్వండి అంటూ వారి వెంట పడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది.

పోలీసుల మద్దతుతోనే తవ్వకాలు

గతంలో ఒక టిప్పర్ మొరంకు రూ.800 ట్రాక్టర్‌కు రూ.200 ప్రభుత్వానికి డీడీ కట్టాల్సి వచ్చేది. ప్రస్తుతం టిప్పర్‌కు రూ.1800 ట్రాక్టర్‌కు రూ.400 కు పెంచడంతో అనుమతులు తీసుకునేందుకు టిప్పర్ల యజమానులు ముందుకు రావడంలేదు. దీంతో రాత్రి సమయంలో పోలీసుల మద్దతుతో అక్రమంగా మొరం తరలించుకుపోతున్నారు. జేసీబీలను ఏర్పాటు చేసి టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలో గుట్ట తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. ఎవరైనా అక్రమంగా తవ్వకాలు జరిపితే కేసు నమోదు చేస్తాం. అలాగే మనిపూర్ తండా, మంత్రోనిపల్లి గ్రామ శివారులోని గుట్టలపై దృష్టి పెట్టి ఎర్రమట్టి తరలించకుండా చర్యలు తీసుకుంటాం.

– సింధూజ, తహసీల్దార్, ధన్వాడ

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



ప్రహరీ లేని ప్రాథమికోన్నత పాఠశాల

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు అనేక మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే పాఠశాల ఊరి చివర ఉండడం, పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో పందులు, కుక్కలు బడిలోకి వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో మందుబాబులు పాఠశాలలోనే కూర్చొని మద్యం తాగుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థిని, విద్యార్థులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1987–88లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 37 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకున్నారు. అలాగే చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యా నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల జీహెచ్‌ఎం ఉపాధ్యాయులు సురేష్, రిటైర్డ్ ఎంఈఓ వెంకటేశ్వర్లు, నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండటం చూసి గర్వంగా ఉందన్నారు. తర్వాత ఎంబీబీఎస్ సీటు సాధించిన పూర్వ విద్యార్థుల పిల్లలు మీనాక్షి, విజయలక్ష్మి, పద్మలను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

నారాయణపేట టౌన్: దేశ ప్రజలను ఐక్యం చేయడానికి హిందీ భాష ఎంతో దోహదపడుతుందని అధ్యక్షుడు హరి నారాయణ్ భట్టడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక హిందీ ప్రచార సమితి కార్యాలయంలో హిందీ దినోత్సవ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ప్రతిభ పాటవా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింహా రావ్ కల్యాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలను ఐక్యం చేయడానికి హిందీ భాష ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హిందీ భాష నేర్చుకోవడం వల్ల వ్యాపార, మీడియా, బ్యాంక్, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయన్నారు.అలాగే హిందీ భాషను ప్రచారం చేయడానికి స్థానిక హిందీ ప్రచార సమితి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ కాంబ్లే, సహ కార్యదర్శి సుఖ్‌దేవ్, ఆత్మరావ్ ఎడ్కే, విఠల్‌రావ్, బల్బీర్, రాకేష్, నర్సింహా, రామకృష్ణ, దీపక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నారాయణపేట టౌన్: సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవ సమావేశంలో పాల్గొని మట్లాడారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రభుత్వ పాలనలో పారదర్శకత తేవాల్సిన అధికారులు చట్టాన్ని పట్టించుకోవడం లేదన్నారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. లీగల్ అడ్వైజర్ లక్ష్మీనారాయణ, సమాచార హక్కు చట్టం నారాయణపేట అధ్యక్షుడు చిన్నయ్య, జిల్లా ఇంఛార్జి కుర్మయ్య, జిల్లా సలహాదారు జిందప్ప, నారాయణపేట అసెంబ్లీ ఇంఛార్జి గణేష్ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో దెబ్బతిన్న రోడ్డు



అధ్వానంగా తయారైన రోడ్డు

మరికల్: గుంతలమయంగా మారిన కన్మనూర్ రోడ్డుకు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కన్మనూర్ రోడ్డు పక్కన పలు ఇటుక బట్టీలు ఉండడంతో సామగ్రిని తరలించడం అలాగే ఇటుకల సరఫరాకు టిప్పర్లు వినియోగించడంతో రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో మరికల్ నుంచి కన్మనూర్ మీదుగా నర్వ వరకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి టిప్పర్లను అడ్డుకొని రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

కోస్గి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల కు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఈ నెల 14న చేపట్టిన రాష్ట బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్ల నర్సింము లు కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, మేధావు లు, విద్యాలయాలు, ప్రతినిధులు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో రమేష్ , చెన్నప్ప , గోపాల్ తదితరులు ఉన్నారు.

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్ల సాధన కోసం బీసీ దళపతి రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు ఈ నెల 14న చేపట్టిన రాష్ట బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకతీతంగా, బీసీ కుల, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేసి సత్తా చాటాలని కోరారు.

మురుగు కాలువ నిర్మించాలి



మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామంలో ప్రధాన రహదారుల వెంబడి మురుగు కాలువలు లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా గ్రామ వర్కూర్ నుంచి నేరడగం గ్రామానికి వెళ్లే రహదారిలో మురుగు కాలువ లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిలుస్తుంది. దీంతో దుర్వాసనతో పాటు పందులు స్వైరవిహారం చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు వలన రోగాలు వ్యాపిస్తున్నాయని సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక పళ్ల హనుమాన్ మందిరం సమీపంలో ఉన్న ప్రధాన మురుగు కాలువ పై భాగంలో చెత్త పేరకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. కాలువలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో స్థానిక ప్రజలు, అటుగా వెళ్లే వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అదే విధంగా దోమల బెడద కూడా అధికంగా ఉండడంతో మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని అధికారులు చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కోస్గి రూరల్: గొడవకు పాల్పడిన ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. గుండుమాల్ మండల కేంద్రంలోని ఓ వీధిలో పక్క పక్కనే నివాసముంటున్న రెండిళ్లకు చెందిన వ్యక్తులు తరచూ గొడవకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వారికి నచ్చజెప్పారు. అయినా వినకుండా మళ్లీ గొడవకు దిగడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దేశ అభివృద్ధే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



ధన్వాడలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల పథ సంచలన్

ధన్వాడ: దేశ అభివృద్ధికి ప్రతి హిందువు పాటుపడాలని విభాగ్ భౌద్ధిక్ ప్రముఖ్ కట్ట ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అప్పాజి గ్రౌండ్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పథ సంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్త కట్ట ప్రభాకర్ మాట్లాడుతూ సనాతన ధర్మంతో విశ్వశాంతి చేకూరుతుందని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఎల్లప్పుడు దేశ సేవలోనే ఉంటారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి నేటికీ వంద సంవత్సరాలు పూర్తయినా సందర్భంగా దేశ వ్యాప్తంగా శతాబ్ధి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరభద్రప్ప, నాగరాజు, ఉదయభాను, సురేందర్, మల్లయ్య, గోవర్ధన్‌గౌడ్‌తో పాటు సంఘ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శతాబ్ధి ఉత్సవాలకు స్వయం సేవకులు

ఊట్కూరు: మండలంలోని రాజాపూర్ గ్రామంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన శోభయాత్రకు ఊట్కూరు నుంచి స్వయం సేవకులు ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ధి ఉత్సవాల సందర్భంగా 1500 మంది స్ఫూర్తి గణవేశ్ స్వయం సేవకులతో శోభయాత్ర నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఊట్కూరు, అవుసలోనిపల్లి, బిజ్వార్, ఎడివెల్లి, ముగ్దుంపూర్ తదితర గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో గొల్ల భాస్కర్, కృష్ణ, నర్సింగప్ప, కేశవరావు, సందిప్ పాల్గొన్నారు.

కర్ణాటక సీఎం తనయుడికి ఘన స్వాగతం



యతీంద్ర సిద్ధరామయ్యను సన్మానిస్తున్న మండల నాయకులు

కృష్ణా/మక్తల్: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనయుడు యతీంద్ర సిద్ధరామయ్య ఆదివారం రాయచూర్ నుంచి యాద్గీర్ పట్టణానికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో మండలంలోని హిందుపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కురువ సమాజం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకులతో కొద్దిసేపు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అటు కర్ణాటక, ఇటు తెలంగాణ అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి, సురేష్, మాలింగప్ప, శ్రీకాంత్, శంక్రప్ప, బాల్‌రాజ్ కున్సీ, రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించండి



కాలనీకి వెళ్లే రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

మద్దూరు: మండలంలోని బుడగ జంగాల కాలనీ ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కాలనీలో కనీస అవసరాలైన తాగునీరు సౌకర్యం, మురుగు కాల్వల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమ బాధలు పట్టించుకోకపోవడంతో తామే సొంతంగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నామని అయితే సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా చాలు కాలనీకి రాకపోకలు నిలిచిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పన్నులు మాత్రం ఠంచనుగా వసూలు చేస్తున్నా అధికారులు కాలనీలో కనీసం అవసరాలైన తాగునీరు, మురుగు కాల్వలు, బీటీ రోడ్డు నిర్మించి తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న గ్రామస్తులు

మరికల్: మండలంలోని జిన్నారం గ్రామానికి చెందిన బొక్కలి సాయిలు అనే వ్యక్తి మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో గ్రామస్తులు అందరూ కలిసి రూ.75,116 కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. భవిష్యత్‌లోనూ కుటుంబానికి అండగా ఉంటామని బాధిత కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నర్వ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న మునిస్వామి ఆదివారం అకస్మికంగా మరణించాడు. ఈ క్రమంలో మృతుడి కుటుంబానికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తోడుగా నిలిచారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరఫున రూ.20 వేలు అందించారు.

వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



కొత్తపల్లి: మండల పరిధిలోని కొత్తపల్లి–భూనీడు వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పూర్తి చేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలంలో వాగు ఉధృతికి ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతుండడంతో ప్రజలు అవస్థలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పనులు కూడా ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో పనులు ఆపేశారు. అయితే వర్షాలు తగ్గినా పనులు మాత్రం ఆపేసిన పనులు ప్రారంభించలేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



మరికల్: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తికి మార్కెట్‌లో మద్దతు ధర లభించకపోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరుసగా భారీ వర్షాలు కురవడంతో పత్తికి తీరాని నష్టం జరిగింది. గతేడాది క్వింటాల్ పత్తి రూ.7.500 నుంచి రూ.9500 పలుకగా ఈ ఏడాది రూ. 5,500 నుంచి రూ.7020 పలుకుతుంది. దీంతో పంటను తక్కువ ధరకు అమ్మేందుకు రైతులు ఇష్టపడటం లేదు. కొందరు రైతులు మద్దతు ధరల కోసం పొలాల దగ్గరనే నిల్వ చేసుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

ఎటుచూసినా పచ్చదనమే



కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన పచ్చని వరి పంటలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కోయిల్‌సాగర్ పాత ఆయకట్టు పరిధిలో మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట మండలాల్లో 8 వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా కలకలాడుతుంది. ఈ ప్రాజెక్టు కింద కుడి, ఎడమ ఆయకట్టు కింద 12 వేల ఎకరాల్లో వరి సాగు అయింది. దీంతో కనుచూపుమేర పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి.

– మరికల్